Office : 9440815774 మా ప్రతి అక్షరం - ప్రజల కోసం వ్యవస్థాపకులు : డి. విజయ్ కుమార్

# చిత్తూరు ఎక్స్‌ప్రెస్

APETL/2024/86143 జాతీయ తెలుగు దినపత్రిక




ప్రచురణ : చిత్తూరు, తిరుపతి సంపుటి : 02 సంచిక : 72 ఎడిటర్ : కె ఎల్ కృష్ణంరాజు శనివారం 17 అక్టోబర్ 2026 పేజీలు : 4 వెల : 2



## ఇది ప్రభుత్వాన్ని మార్చే కుట్ర

- బీజేపీ అధ్యక్షుడు నితిన్ నబీన్
- అభిజీత్ దీప్కే, నేహా బోరాను కస్టడీలోకి తీసుకున్న ఢిల్లీ పోలీసులు
- విదేశీ శక్తులతో దేశాన్ని అస్థిరపరిచే ప్రయత్నం చేస్తున్నారు
- ప్రజాస్వామ్యంలో అధికారం ప్రజా తీర్పుతో వస్తుందని వ్యాఖ్య

# స్థానిక సమరానికి టీడీపీ సై

- అభ్యర్థుల ఎంపికలో చంద్రబాబు పక్కా వ్యూహం
- పట్టణ స్థానిక సంస్థల ఎన్నికలపై దృష్టి సారించిన టీడీపీ అధిష్ఠానం
- సీఎం చంద్రబాబు, లోకేశ్, పల్లా నేతృత్వంలో అభ్యర్థుల ఎంపిక ప్రక్రియ
- క్షేత్రస్థాయి అభిప్రాయాలు, ప్రజామోదం ఆధారంగా వడపోత
- మేయర్లు, ఛైర్మన్ల ప్రత్యక్ష ఎన్నిక నేపథ్యంలో అభ్యర్థుల ఎంపికలో ప్రత్యేక శ్రద్ధ
- ట్రిపుల్ ఇంజన్ సర్కార్ ఏర్పాటుతో అభివృద్ధిని వేగవంతం చేయడమే లక్ష్యం

**చిత్తూరు ఎక్స్‌ప్రెస్, అమరావతి**

ఆంధ్రప్రదేశ్‌లో పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల సందడి మొదలైన నేపథ్యంలో అధికార తెలుగుదేశం పార్టీ అభ్యర్థుల ఎంపికపై పూర్తిస్థాయిలో దృష్టి సారించింది. కూటమి భాగస్వామ్య పక్షాలతో సీట్ల సర్దుబాటు ప్రక్రియను పూర్తి చేసిన టీడీపీ అధిష్ఠానం, ఇప్పుడు గెలుపు గుర్రాలను గుర్తించే పనిలో నిమగ్నమైంది. ముఖ్యమంత్రి, పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు ఈ ప్రక్రియను స్వయంగా పర్యవేక్షిస్తూ, సమర్థులైన అభ్యర్థులను బరిలోకి దించేందుకు ముమ్మర కసరత్తు చేస్తున్నారు. ఈ కీలకమైన అభ్యర్థుల ఎంపిక ప్రక్రియలో ముఖ్యమంత్రి చంద్రబాబుతో పాటు పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి నారా లోకేశ్, రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు క్రియాశీలక పాత్ర పోషిస్తున్నారు. కేవలం పార్టీ వద్ద ఉన్న సమాచారంపైనే ఆధారపడకుండా, క్షేత్రస్థాయిలో ప్రజల అభిప్రాయాలను విస్తృతంగా సేకరిస్తున్నారు. అభ్యర్థి వ్యక్తిగత ప్రతిష్ఠ, ప్రజామోదం, నాయకత్వ లక్షణాలు, సేవా నిబద్ధత వంటి అంశాలను ప్రధానంగా పరిగణనలోకి - మిగతా 3లో

## అందరికీ ఆనందం, ఆదాయం, ఆరోగ్యం ఉండాలని ప్రార్థించా



- దసరా ఉత్సవాల్లో భాగంగా మూలానక్షత్రం రోజున ముఖ్యమంత్రి చంద్రబాబు దంపతులు ఇంద్రకీలాద్రిని సందర్శించారు
- భక్తుల కేరింతలకు సీఎం స్పందించి వారికి ఆత్మీయంగా అభివాదం చేస్తూ ముందుకు సాగారు.
- ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మకు పట్టువస్త్రాలు సమర్పించిన సీఎం చంద్రబాబు
- ప్రభుత్వం తరఫున అమ్మవారికి పట్టువస్త్రాలు, సారె సమర్పణ
- ముఖ్యమంత్రికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికిన అధికారులు
- దర్శనానంతరం పండితుల వేదాశీర్వచనం
- దసరా శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ప్రత్యేక పూజలు



## కొత్త డీలిమిటేషన్ ప్రతిపాదనలపై అఖిలపక్షం ఏర్పాటు చేయండి

- కేంద్ర ప్రభుత్వ వైఖరిపై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే
- పార్లమెంటులో ప్రవేశపెట్టే ముందు అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసి అన్ని పార్టీల అభిప్రాయం తీసుకోవాలని డిమాండ్
- ఆగస్టు 13న వర్షాకాల సమావేశాలను నిరవధికంగా వాయిదా వేసి ఇప్పటికే 64 రోజులు గడిచినా, పార్లమెంట్ ఉభయ సభలను ఇంకా వాయిదా వేయలేదు



## పిల్లల సోషల్ మీడియా భద్రత

- సోషల్ మీడియా ముప్పు నుంచి పిల్లల రక్షణపై కేంద్రానికి సుప్రీంకోర్టు నోటీసు
- పటిష్ఠమైన నియంత్రణ, వయసు నిర్ధారణ ఉండాలని కోరిన పిటిషనర్లు
- ప్రస్తుత చట్టాలు సరిపోవని, పిల్లలపై తీవ్ర ప్రభావం పడుతోందని పిటిషన్‌లో వెల్లడి
- ఆన్‌లైన్ వేధింపులు, మానసిక ఆరోగ్యంపై పిటిషనర్ల ఆందోళన
- తదుపరి విచారణను డిసెంబర్ 3వ తేదీకి వాయిదా వేసిన ధర్మాసనం



## బంగ్లాదేశ్ తరహాలో పాలన మార్పునకు కాంగ్రెస్ కుట్ర

- రాహుల్‌పై రాజ్‌నాథ్ సంచలన ఆరోపణలు
- భారత్‌లో బంగ్లాదేశ్ తరహా పాలన మార్పునకు కాంగ్రెస్ ప్రయత్నిస్తోందని రాజ్‌నాథ్ ఆరోపణ
- ప్రజాస్వామ్యం పేరుతో దేశంలో అరాచకం సృష్టించాలని చూస్తోందని విమర్శ
- రాహుల్ గాంధీ, కాంగ్రెస్ నేతలపై రక్షణ మంత్రి తీవ్ర వ్యాఖ్యలు
- అధికారం కోసమే రాజ్యాంగ సంస్థలను లక్ష్యంగా చేసుకుంటున్నారని ఆరోపణ
- ఇందిరాగాంధీ విధించిన ఎమర్జెన్సీని ప్రస్తావిస్తూ కాంగ్రెస్‌పై విమర్శలు

# రాయలసీమలో ఎన్నికల ఉద్రిక్తతలు



- ఈసీకి ఫిర్యాదు చేసిన టీడీపీ, వైసీపీ
- స్థానిక ఎన్నికల నామినేషన్ల వేళ రాయలసీమలో ఘర్షణలు
- దౌర్జన్యాలకు పాల్పడ్డారంటూ రాష్ట్ర ఎన్నికల సంఘానికి ఒకరిపై ఒకరు ఫిర్యాదు
- పుంగనూరులో ఎంపీ మిథున్‌రెడ్డి దాడులకు పాల్పడ్డారని ఆరోపణ
- టీడీపీ నాయకులే దాడులకు పాల్పడ్డారని వైసీపీ నేతలు

**చిత్తూరు ఎక్స్‌ప్రెస్, అమరావతి**

ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ రాయలసీమలో తీవ్ర ఉద్రిక్తతలకు దారితీసింది. పలు ప్రాంతాల్లో వైసీపీ నేతలు, కార్యకర్తలు దాడులకు పాల్పడుతూ, ప్రతిపక్షాలను నామినేషన్లు వేయకుండా అడ్డుకుంటున్నారని ఆరోపిస్తూ టీడీపీ రాష్ట్ర ఎన్నికల సంఘానికి (ఎస్ఈసీ) ఫిర్యాదు చేసింది. ఈ మేరకు టీడీపీ సీనియర్ నేతలు వర్ల రామయ్య, అశోక్‌బాబు తదితరులు శుక్రవారం ఎస్ఈసీ కార్యాలయానికి వెళ్లి ఎన్నికల కమిషనర్‌ను కలిశారు. రాయలసీమలోని పుంగనూరు, రాయచోటి, ధర్మవరం, తిరుపతి - మిగతా 3లో




## అయోమయంలో భారత విదేశాంగ అధికారులు

- మోదీ కోరుకుంటే నేనే వివరిస్తా
- అమెరికా మంత్రి మార్కో రూబియో భారత పర్యటనపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ
- రూబియో ముంబయిలో భారత అధికారులతో సమావేశం
- కానున్న నేపథ్యంలో విదేశాంగ శాఖలోనే గందరగోళం నెలకొంది

# జడ్పీటీసీగా అవకాశం కల్పించండి

## టిడిపి నేత చలపతి



**కుప్పం, చిత్తూరు ఎక్స్ ప్రెస్, అక్టోబర్ 16:** మూడు దశాబ్దాలుగా తెలుగుదేశం పార్టీ అభివృద్ధికి కృషి చేస్తున్న తనకు కుప్పం రూరల్ జడ్పీటీసీ అభ్యర్థిగా అవకాశం కల్పించాలని కుప్పం మండలం మిట్టపల్లి గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నేత వి. చలపతి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును కోరారు. పార్టీ కోసం మూడు దశాబ్దాలుగా అంకితభావంతో పనిచేసిన తనకు అవకాశం కల్పించాలంటూ సీఎం చంద్రబాబుకు లేఖ రాసినట్లు చలపతి తెలిపారు. పార్టీ ప్రతిపక్షంలో ఉన్న సమయం లోనూ అండగా నిలిచానని, 2024 ఎన్నికల్లో బలిజ సామాజికవర్గ ప్రజలను టీడీపీకి మద్ద తుగా నిలిపేందుకు కృషి చేశానని తెలిపారు. గతంలో పలుమార్లు పదవుల కోసం విజ్ఞప్తి చేసినా అవకాశం దక్కలేదని పేర్కొన్నారు. పార్టీ సేవలను గుర్తించి తనకు అవకాశం కల్పిం చాలని వినతిపత్రం ద్వారా కోరారు.

## అయ్యప్ప భక్తుల సంఘం

# సికింద్రాబాద్ జిల్లా అధ్యక్షుడిగా మద్దెల యాదగిరి

**సికింద్రాబాద్, చిత్తూరు ఎక్స్ ప్రెస్,అక్టోబర్16:**



అఖిల భారత అయ్యప్ప భక్తుల సంఘం (ABA BS) సికింద్రాబాద్ జిల్లా అధ్యక్షుడిగా గురుస్వామి మద్దెల యాదగిరి నియమితులయ్యారు. ఈ విషయాన్ని సంఘం జాతీయ అధ్యక్షుడు అడ్వకేట్ వాంద్రాసి పెంచలయ్య మీడియాకు వెల్లడించారు. ఈ సందర్భంగా మద్దెల యాదగిరి మాట్లాడుతూ.. అయ్యప్ప భక్తుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తానని తెలిపారు. సంఘాన్ని మరింత బలోపేతం చేయడంతో పాటు, భక్తుల సంక్షేమానికి వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తానని పేర్కొన్నారు. తనకు జిల్లా అధ్యక్షుడిగా అవకాశం కల్పించిన జాతీయ అధ్యక్షుడు అడ్వకేట్ వాంద్రాసి పెంచలయ్యకు కృతజ్ఞతలు తెలిపారు.

# బీసీలకు 40 శాతానికి పైగా రాజకీయ ప్రాధాన్యత



**శ్రీకాళహస్తి, చిత్తూరు ఎక్స్ ప్రెస్, అక్టోబర్ 16:** శ్రీకాళహస్తి బీసీల సామాజిక, ఆర్థిక, రాజకీయ అభ్యున్నతికి తెలుగుదేశం పార్టీ కట్టుబడి ఉందని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి పేర్కొన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 40 శాతానికి పైగా స్థానాలు కేటాయించడం శుభపరిణామమన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని ఎన్డీయే కూటమి ప్రభుత్వం బీసీలకు రాజకీయ ప్రాతినిధ్యం కల్పించేందుకు ప్రాధాన్యతనిస్తోందని తెలిపారు. బీసీలకు అధిక ప్రాధాన్యత కల్పిస్తున్న టీడీపీ, ఎన్డీయే కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుతూ శుక్రవారం పలువురు బీసీ నాయకులు ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డిని కలిసి దుశ్శాలువాతో సత్కరించి, విఘ్నేశ్వరుని దారు శిల్పాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విశ్వబ్రాహ్మణ సంక్షేమం మరియు అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ డా.జి.దశరథాచారి, వన్నెకుల క్షత్రియ సంక్షేమం మరియు అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ మిన్నల్ రవి, బిసి విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డా.యం. ఉమేష్ రావు, నాయీ బ్రాహ్మణ సాధికార సమితి తిరుపతి పార్లమెంటు సోషల్ మీడియా కన్వీనర్ కోట చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

## వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలోకి

# జనసేన నేత గరికపాటి చంద్ర

### మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి సమక్షంలో చేరిక

**శ్రీకాళహస్తి, చిత్తూరు ఎక్స్ ప్రెస్, అక్టోబర్ 16:**



శ్రీకాళహస్తి శ్రీకాళహస్తికి చెందిన జనసేన పార్టీ నాయకుడు, కాపునాడు అధ్యక్షుడు గరిక పాటి చంద్ర వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి సమక్షంలో ఆయన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కండువా కప్పుకొని పార్టీలోకి చేరారు. ఈ సందర్భంగా గరికపాటి చంద్ర చేరికకు సంబంధించిన వివరాలు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. శ్రీకాళహస్తి నియోజకవర్గంలో చోటుచేసుకున్న ఈ రాజకీయ పరిణామం స్థానిక రాజకీయాల్లో ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ కార్యక్రమంలో వైయస్సార్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీకాళహస్తిలో నూతన

# ఈవీ ఎలక్ట్రిక్ బైక్ షోరూమ్ ప్రారంభం

**శ్రీకాళహస్తి, చిత్తూరు ఎక్స్ ప్రెస్, అక్టోబర్ 16:**



శ్రీకాళహస్తి పట్టణంలో ఎలక్ట్రిక్ వాహనాల వినియోగాన్ని ప్రోత్సహించే దిశగా మరో అడుగు పడింది. పట్టణంలోని ధర్మరాజుల స్వామి ఆలయం సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఈవీ ఎలక్ట్రిక్ బైక్ షోరూమ్ గురువారం ఘనంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి సతీమణి బొజ్జల రిషితా రెడ్డి, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు కోలా ఆనంద్ రిబ్బన్ కట్ చేసి షోరూమ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా షోరూమ్ యాజమాన్యం ముఖ్య అతిథులకు ఘనస్వాగతం పలికింది. అనంతరం వారు షోరూమ్‌లో అందుబాటులో ఉన్న వివిధ మోడళ్ల ఎలక్ట్రిక్ బైక్‌లను పరిశీలించారు. వాటి బ్యాటరీ సామర్థ్యం, మైలేజీ, పనితీరు, పర్యావరణ ప్రయోజనాలు తదితర వివరాలను నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ముఖ్య అతిథులు మాట్లాడుతూ.., ప్రస్తుత పరిస్థితుల్లో ఇంధన పొదుపుతో పాటు పర్యావరణ పరిరక్షణ కు దోహదపడే ఎలక్ట్రిక్ వాహనాల వినియోగం పెరగడం శుభపరిణామమని పేర్కొన్నారు. పెరుగుతున్న ఇంధన ధరల నేపథ్యంలో ఎలక్ట్రిక్ వాహనాలు ప్రజలకు ప్రయోజనకరంగా నిలుస్తాయని తెలిపారు. నూతనంగా ప్రారంభమైన ఈవీ షోరూమ్ వ్యాపారపరంగా అభి వృద్ధి చెందడంతో పాటు వినియోగదారులకు నాణ్యమైన సేవలు అందించాలని ఆకాంక్షిస్తూ యాజమాన్యానికి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో షోరూమ్ యాజమాన్యం, స్థానిక నాయకులు, పట్టణ ప్రముఖులు, వాహన ప్రియులు పాల్గొన్నారు.

# ఎంబీబీఎస్ ఫలితాల్లో పీఈఎస్ వైద్య కళాశాల ప్రభంజనం

- **92.62 శాతం ఉత్తీర్ణతతో రాష్ట్ర ప్రైవేట్ వైద్య కళాశాలల్లో అగ్రస్థానం**
- **149 మందికి పరీక్షలు.. 138 మంది ఉత్తీర్ణత**

**కుప్పం, చిత్తూరు ఎక్స్‌ప్రెస్, అక్టోబర్16:** వైద్య విద్యలో నాణ్యమైన బోధన, అధ్యాపకుల అంకితభావం, విద్యార్థుల క్రమశిక్షణకు నిదర్శనంగా కుప్పంలోని పీఈఎస్ వైద్య కళాశాల నిలిచింది. డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విజ్ఞాన విశ్వ విద్యాలయం ఆధ్వర్యంలో సెప్టెంబర్ 2026లో నిర్వహించిన మొదటి సంవత్సరం ఎంబీబీఎస్ పరీక్షల ఫలితాల్లో కళాశాల విద్యార్థులు సత్తా చాటారు. మొత్తం 92.62 శాతం ఉత్తీర్ణత సాధించి, రాష్ట్రంలోని ప్రైవేట్ వైద్య కళాశాలల్లో అగ్రస్థానంలో నిలిచినట్లు కళాశాల వర్గాలు వెల్లడించాయి. ఈ పరీక్షలకు కళాశాల నుంచి మొత్తం 149 మంది విద్యార్థులు హాజరుకాగా, వారిలో 138 మంది ఉత్తీర్ణులయ్యారు. ఉత్తీర్ణులైన వారిలో తొమ్మిది మంది విశిష్ట శ్రేణిలో,76 మంది ప్రథమ శ్రేణిలో,53 మంది ద్వితీయ శ్రేణిలో నిలిచారు. వైద్య విద్యలో తొలి దశగా భావించే మొదటి సంవత్సరం పరీక్షల్లో విద్యార్థులు సాధించిన ఈ ఫలితాలు కళాశాల విద్యా ప్రమాణాలను ప్రతిబింబిస్తున్నాయని అధ్యాపకులు పేర్కొన్నారు.

**కళాశాల స్థాయిలో టాపర్ల ప్రతిభ**

పరీక్షా ఫలితాల్లో నలమోతు వెంకట హేమంత్ 84.22 శాతం మార్కులు సాధించి కళాశాల స్థాయిలో ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకున్నారు. ఎస్. స్వస్తికా మూర్తి 80.22 శాతం మార్కులతో ద్వితీయ స్థానంలో నిలవగా, ఎ. సత్యనారాయణ చార్యులు 79.78 శాతం మార్కులతో తృతీయ స్థానాన్ని సాధించారు. వీరి ప్రతిభ కళాశాల విద్యార్థుల్లో ఉత్సాహాన్ని నింపింది. విశిష్ట శ్రేణిలో ఉత్తీర్ణులైన విద్యార్థుల్లో ఆలూరు వెంకట సంధ్య 78.89 శాతం, చిలమకూరి ప్రణీత్ సాయి 77.22 శాతం, గొరజాల దిలీప్ చౌదరి 77.22 శాతం, షేక్ మొబీనా 77 శాతం, షేక్ కొత్తపేట ఫుజైల్ 76.67 శాతం, పసుపులేటి వర్ష 76 శాతం మార్కులు సాధించి తమ ప్రతిభను చాటుకున్నారు.

**విద్యార్థులు, అధ్యాపకులకు అభినందనలు**

కళాశాల సాధించిన విజయంపై పీఈఎస్ వైద్య కళాశాల అసోసియేట్ మెడికల్ డైరెక్టర్ డాక్టర్ రూపా సురేష్ హర్షం వ్యక్తం చేశారు. పరీక్షల్లో ఉత్తీర్ణులైన విద్యార్థులందరికీ అభినందనలు తెలిపారు. విద్యార్థుల నిరంతర కృషి, క్రమశిక్షణ, చదువుపట్ల నిబద్ధతతోపాటు అధ్యాపకుల మార్గదర్శకత్వం ఈ విజయానికి ప్రధాన కారణాలని పేర్కొన్నారు. వైద్య విద్యలో ప్రాథమిక వైద్య శాస్త్రాంశాలపై పటిష్ఠమైన అవగాహన కల్పించడం, సమర్థవంతమైన అధ్యయన అలవాట్లను పెంపొందించడం విద్యార్థుల విజయానికి దోహదపడిందని ఆమె తెలిపారు. విద్యార్థుల ప్రతిభను వెలికితీసేందుకు అధ్యాపకులు చేసిన సమష్టి కృషి అభినందనీయమని పేర్కొన్నారు. కళాశాల డీన్, ప్రిన్సిపాల్ డాక్టర్ హెచ్.ఆర్. కృష్ణారావు కూడా



NALAMOTHU VENKATA HEMANTH
UHS Reg No: 25M102010089



S SWASTIKA MURTHY
UHS Reg No: 25M102010111



A SATHYA NARAYANA CHARYULU
UHS Reg No: 25M102010001

విద్యార్థులు, అధ్యాపకులను అభినందించారు. మొదటి సంవత్సరం ఎంబీబీఎస్ పరీక్షల్లో సాధించిన విజయం వైద్య విద్యార్థుల భవిష్యత్తుకు పటిష్ఠమైన పునాది అని అన్నారు. ఈ విజయంతో సంతృప్తి చెందకుండా మరింత కష్టపడి చదివి, వైద్య రంగంలో ఉన్నత ప్రమాణాలను అందుకోవాలని విద్యార్థులకు సూచించారు. వైద్య పరిజ్ఞానంతో పాటు రోగులకు మెరుగైన సేవలు అందించేందుకు అవసరమైన వైద్య నైపుణ్యాలు, మానవీయ దృక్పథం, సేవాభావాన్ని పెంపొందించుకోవాలని తెలిపారు. భవిష్యత్తులో సమర్థులైన వైద్యులుగా ఎదిగి సమాజానికి నాణ్యమైన వైద్య సేవలు అందించాలని ఆకాంక్షించారు. మొత్తంగా, మొదటి సంవత్సరం ఎంబీబీఎస్ పరీక్షల్లో పీఈఎస్ వైద్య కళాశాల సాధించిన 92.62 శాతం ఉత్తీర్ణత విద్యార్థుల పట్టుదలతో పాటు అధ్యాపకుల అంకితభావాన్ని చాటుతోంది. రాష్ట్రంలోని ప్రైవేట్ వైద్య కళాశాలల్లో అగ్రస్థానంలో నిలవడం కళాశాలకు గర్వకారణంగా మారింది.

# పురపోరుకు సిద్ధమైన పట్టణ ఐటీడీపీ

### మున్సిపల్ ఎన్నికల వ్యూహాలపై ప్రత్యేక సమావేశం..
### అభ్యర్థులకు నామినేషన్ పత్రాల పూరింపులో సహకారం



**హిందూపురం, చిత్తూరు ఎక్స్ ప్రెస్,అక్టోబర్ 16:** స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో హిందూపురం పట్టణ ఐటీడీపీ శ్రేణులు మున్సిపల్ ఎన్నికలకు సన్నద్ధమవుతున్నాయి. ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ ఆదేశాల మేరకు శుక్రవారం ఐటీడీపీ సభ్యులు ప్రత్యేక సమావేశం నిర్వహించి, ఎన్నికల్లో అనుసరించాల్సిన కార్యాచరణపై చర్చించారు. వార్డు కౌన్సిలర్ అభ్యర్థులు నామినేషన్ పత్రాల పూరింపులో ఇబ్బందులు పడకుండా స్థానిక ఎమ్మెల్యే కార్యాలయం వద్ద ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేశారు. అభ్యర్థులకు అవసరమైన సహకారం అందిస్తూ నామినేషన్ పత్రాలను పూరించేందుకు ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో ఐటీడీపీ పార్లమెంట్ అధ్యక్షుడు రామాంజనేయులు, నియోజకవర్గ అధ్యక్షుడు నజీర్ అహ్మద్, అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి కొల్లకుంట సురేష్, పట్టణ అధ్యక్షుడు అనిల్ కుమార్, మన్సూర్, జహీర్, షేక్షా, నవీన్‌తో పాటు వివిధ వార్డుల ఐటీడీపీ అధ్యక్షులు పాల్గొన్నారు.

# మున్సిపల్ ఎన్నికల నామినేషన్లలో తొలిరోజు మందకొడి

### చైర్మన్ పదవులకు 3 నామినేషన్లు.. వార్డు సభ్యులకు 36 దాఖలు

**చిత్తూరు,చిత్తూరు ఎక్స్‌ప్రెస్,అక్టోబర్16:** జిల్లాలో పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ తొలిరోజు మందకొడిగా సాగింది. చిత్తూరు నగరపాలక సంస్థతో పాటు కుప్పం, నగరి, పలమనేరు మున్సిపాలిటీల్లో శుక్రవారం నిర్వహించిన నామినేషన్ల స్వీకరణలో మున్సిపల్ చైర్మన్ పదవులకు మూడు, వార్డు సభ్యుల స్థానాలకు 36 నామినేషన్లు దాఖలయ్యాయి. చిత్తూరు మేయర్ పదవికి ఒక్క నామినేషన్ కూడా దాఖలు కాలేదు. జిల్లా ఎన్నికల అధికారి వెల్లడించిన వివరాల ప్రకారం.. కుప్పం మున్సిపాలిటీలో చైర్మన్ పదవికి రెండు నామినేషన్లు దాఖలయ్యాయి. ఈ రెండు నామినేషన్లు తెలుగుదేశం పార్టీ తరఫున నమోదయ్యాయి. వార్డు సభ్యుల స్థానాలకు 11 నామినేషన్లు అందాయి. నగరి మున్సిపాలిటీలో చైర్మన్ పదవికి ఒక నామినేషన్ దాఖలైంది. వార్డు సభ్యుల స్థానాలకు ఏడు నామినేషన్లు వచ్చాయి. చిత్తూరు నగరపాలక సంస్థలోని 60 వార్డులకు సంబంధించి 15 నామినేషన్లు దాఖలు కాగా, మేయర్ పదవికి ఎలాంటి నామినేషన్లు అందలేదు. పలమనేరు మున్సిపాలిటీలోని 36 వార్డులకు సంబంధించి మూడు నామినేషన్లు దాఖలయ్యాయి. అయితే చైర్మన్ పదవికి తొలిరోజు ఎవరూ నామినేషన్ దాఖలు చేయలేదు. మొత్తంగా నాలుగు పట్టణ స్థానిక సంస్థల్లో చైర్మన్, మేయర్ పదవుల కంటే వార్డు సభ్యుల స్థానాలకే అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేసేందుకు ఆసక్తి చూపారు. నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమైన తొలిరోజు తక్కువ సంఖ్యలో దరఖాస్తులు రావడంతో రానున్న రోజుల్లో నామినేషన్ల సంఖ్య పెరిగే అవకాశం ఉంది.

# ఓటర్ల జాబితా సవరణకు గడువు పొడిగింపు

### అక్టోబర్ 22 వరకు క్లెయిమ్‌లు, అభ్యంతరాల పరిష్కారం
### 30న తుది ఓటర్ల జాబితా విడుదల



**చిత్తూరు, చిత్తూరు ఎక్స్‌ప్రెస్, అక్టోబర్16:** ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో క్లెయిమ్‌లు, అభ్యంతరాల పరిష్కారానికి ఎన్నికల సంఘం గడువు పొడిగించింది. ఈ నెల 22వ తేదీ వరకు నోటీసుల ప్రక్రియతో పాటు క్లెయిమ్‌లు, అభ్యంతరాల పరిష్కారానికి అవకాశం కల్పించినట్లు జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి సుమిత్ కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2026 జూలై 1వ తేదీని అర్హత తేదీగా పరిగణిస్తూ చేపట్టిన ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. ఎన్నికల సంఘం ఈ నెల 14న జారీ చేసిన ఉత్తర్వుల మేరకు సవరించిన షెడ్యూల్‌ను అమలు చేయనున్నట్లు వివరించారు. అక్టోబర్ 30న తుది ఓటర్ల జాబితాను ప్రచురించనున్నట్లు స్పష్టం చేశారు. ఓటర్లు వివరాలు పరిశీలించుకోవాలి ఓటర్లు తమ పేర్లు, చిరునామాలు, ఇతర వివరాలు ఓటర్ల జాబితాలో సక్రమంగా నమోదయ్యాయో లేదో పరిశీలించుకోవాలని కలెక్టర్ సూచించారు. జాబితాలో ఏవైనా తప్పులు ఉన్నా, అభ్యంతరాలు వ్యక్తం చేయాల్సి ఉన్నా ఈ నెల 22వ తేదీలోగా సంబంధిత అధికారులను సంప్రదించి పరిష్కరించుకోవాలని కోరారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాలను పకడ్బందీగా అమలు చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. సవరించిన షెడ్యూల్ వివరాలను రాజకీయ పార్టీలకు లిఖితపూర్వకంగా తెలియజేయాలని ఆదేశించినట్లు కలెక్టర్ తెలిపారు.

## మూలా నక్షత్రం, శుక్రవారం సందర్భంగా

# చాముండేశ్వరి అమ్మవారిని దర్శించుకున్న తుడా చైర్మన్



**తుమ్మలగుంట, చిత్తూరు ఎక్స్‌ప్రెస్, అక్టోబర్ 16:** తుమ్మలగుంటలోని శ్రీశ్రీశ్రీ శక్తి చాముం డేశ్వరి అమ్మవారి దేవస్థానాన్ని తుడా చైర్మ న్ డాలర్ దివాకర్ రెడ్డి, ప్రముఖ జ్యోతి ష్యులు డాక్టర్ చక్రధర్ సిద్ధాంతి కుటుంబ సభ్యులు శుక్రవారం దర్శించుకున్నారు. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మూలా నక్షత్రం, శుక్రవారం కలిసి రావడంతో ఈ రోజుకు ప్రత్యేక ఆధ్యాత్మిక ప్రాధాన్యత ఉందని ఆల య వర్గాలు పేర్కొన్నాయి. ఈ సందర్భంగా ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త, టీడీపీ సీనియర్ నాయకుడు బిరుదుల భాస్కర్ రెడ్డి దర్శన ఏర్పాట్లు చేశారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.

# వైభవంగా ఆరిమాని గంగమ్మ తల్లి పుష్పయాగం

### 1500 మంది భక్తులకు అన్నదానం



**ఎస్ఆర్ పురం, చిత్తూరు ఎక్స్ ప్రెస్,అక్టోబర్ 16:** మండలంలోని తయ్యూరు పాయకట్టు ఇలవేల్పు శ్రీ ఆరిమాని గంగమ్మ తల్లి దసరా ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఆరో రోజు అమ్మవారి ఆలయంలో పుష్పయాగాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. తొలుత ఆలయం నుంచి వివిధ రకాల పుష్పాలను ఊరేగింపుగా యాగశాలకు తీసుకెళ్లి, ఉత్సవమూర్తికి సమర్పించారు. అనంతరం అర్చకుల ఆధ్వర్యంలో పుష్పయాగం నిర్వహించగా, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా గొల్లపల్లి గ్రామానికి చెందిన సుబ్రహ్మణ్యం నాయుడు–గీత దంపతులు సుమారు 1,500 మంది భక్తులకు అన్నదానం నిర్వహించారు. దసరా ఉత్సవాల్లో భాగంగా భక్తులకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ చైర్మన్ జలంధర్ నాయుడు తెలిపారు. కార్య క్రమంలో ఆలయ చైర్మన్ జలంధర్ నాయుడు,వైస్ చైర్మన్ వెంకటరామయ్య, ఈవో వెంకట రాయల్, కమిటీ సభ్యులు నీలమ్మ, గురవయ్య, అమృత, చందు, జయలక్ష్మి, రాజేశ్వరి, పాయకట్టు పెద్దలు పైనేని ధనుంజయ నాయుడు, సిద్ధయ్య శెట్టి, బాలాజీ నాయుడు, సుబ్రహ్మణ్యం నాయుడు, చంద్రబాబు రెడ్డి, బల్లాల దేవరాజు నాయుడు, త్యాగరాజు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికల విధులను బాధ్యతాయుతంగా నిర్వహించాలి

### ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల ప్రకారమే విధులు నిర్వర్తించాలి

**చిత్తూరు, చిత్తూరు ఎక్స్ ప్రెస్,అక్టోబర్ 16:** స్థానిక సంస్థల ఎన్నికల విధులకు నియమితులైన అధికారులు, సిబ్బంది ఎన్నికల కమిషన్ ఆదేశాలు, మార్గదర్శకాల ప్రకారం బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని జిల్లా పరిషత్ సీఈవో రవికుమార్ నాయుడు సూచించారు. ఎన్నికల నిర్వహణలో నిర్లక్ష్యానికి తావులేకుండా, పారదర్శకంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు. చిత్తూరు జిల్లా పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో శుక్రవారం జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల నిర్వహణపై రిటర్నింగ్ అధికారులు (ఆర్వోలు), సహాయ రిటర్నింగ్ అధికారులకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఈవో మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ నిర్దేశించిన గడువులోగా ఎన్నికల ప్రక్రియను పూర్తి చేసేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. మున్సిపల్ ఎన్నికల అనంతరం మండల, జిల్లా పరిషత్ ఎన్నికలు, ఆ తర్వాత గ్రామ పంచాయతీ ఎన్నికలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆర్వో హ్యాండ్‌బుక్‌లోని ప్రతి అంశంపై అధికారులు పూర్తి అవగాహన కలిగి ఉండాలని, ఎన్నికల సమయంలో సొంత నిర్ణయాలు తీసుకోకుండా కమిషన్ నిబంధనల ప్రకారమే ముందుకు సాగాలని సూచించారు. తమకు కేటాయించిన డివిజన్లలో ఓటర్ల జాబితాలను పరిశీలించడంతోపాటు, ఓటర్ల ప్రాతిపదికన రిజర్వేషన్లు, పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలను తనిఖీ చేయాలన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు ఉండేలా ఓటర్ల జాబితాలపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని పేర్కొన్నారు. చిత్తూరు డీఎల్‌డీఓ రవికుమార్, సౌందర్ రాజన్ మాట్లాడుతూ నామినేషన్ల స్వీకరణ, పత్రాల పరిశీలన, ధ్రువపత్రాల ధ్రువీకరణ, అభ్యర్థుల అర్హతలు, నామినేషన్ల తిరస్కరణకు సంబంధించిన నిబంధనలను అధికారులు క్షుణ్ణంగా తెలుసుకోవాలన్నారు. నామినేషన్ల స్వీకరణ, పరిశీలన, ఉపసంహరణ ప్రక్రియల్లో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా ఎన్నికల కమిషన్ నిర్దేశించిన గడువులను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ఎన్నికలు ప్రశాంతంగా, నిష్పక్షపాతంగా జరిగేలా అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. ఈ శిక్షణ కార్యక్రమంలో చిత్తూరు ఆర్డీవో శ్రీనివాసులు, డీఆర్‌డీఏ పీడీ శ్రీదేవి, డ్వామా పీడీ రవికుమార్, జిల్లా విద్యాశాఖ అధికారి లక్ష్మీనారాయణ, తహసీల్దార్లు, ఎంపీడీఓలు, రిటర్నింగ్ అధికారులు, సహాయ రిటర్నింగ్ అధికారులు పాల్గొన్నారు.

# గోదావరి-కావేరి అనుసంధానం సాధ్యమేనా?



**విజయవాడ :** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, తమిళనాడు ముఖ్యమంత్రి, టీవీకే అధినేత జోసెఫ్ విజయ్‌ల మధ్య జరిగిన సమావేశం దక్షిణ భారత రాజకీయ, జలవనరుల వర్గాల్లో ఆసక్తిని రేకెత్తించింది. చారిత్రకంగా చెన్నై నగర తాగునీటి అవసరాల కోసం ఏపీ నుంచి అందించే తెలుగు గంగ నీటి సరఫరాపై ఈ భేటీలో ప్రాథమిక చర్చలు జరిగినప్పటికీ, అసలు సిసలైన కీలక అంశం మాత్రం గోదావరి-కావేరి నదుల అనుసంధానంపైనే నడిచింది. నదుల అనుసంధానంపై సుదీర్ఘకాలంగా స్పష్టమైన ప్రణాళికలతో ఉన్న చంద్రబాబుతో, తమిళనాడు సీఎంగా పగ్గాలు చేపట్టిన విజయ్ ఈ సుదూర జల కల నెరవేర్చేందుకు చేతులు కలపడం అంతర్రాష్ట్ర జల సంబంధాలలో కొత్త అధ్యాయానికి శ్రీకారం చుట్టింది.కావేరి జలాల పంపిణీ విషయంలో కర్ణాటకతో తమిళనాడు దశాబ్దాలుగా వివాదాలను ఎదుర్కొంటోంది. ఈ శాశ్వత నీటి సంక్షోభానికి నాటి ప్రాజెక్టులే పరిష్కారమని భావిస్తున్న సీఎం విజయ్ ఇప్పటికే ప్రధాని నరేంద్ర మోదీని స్వయంగా కలిసి ఒక ప్రతిపాదనను సమర్పించారు. స్పెషల్ పర్పస్ వెహికల్ ఏర్పాటు చేసి, కేంద్ర ప్రభుత్వ పర్యవేక్షణలో యుద్ధప్రాతిపదికన గోదావరి-కావేరి అనుసంధాన ప్రాజెక్టును చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. చంద్రబాబు నాయుడు కూడా జాతీయ నదుల అనుసంధానానికి మొదటి నుంచీ గట్టి మద్దతుదారుడిగా ఉండటంతో, ఇద్దరు పొరుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు ఈ డ్రీమ్ ప్రాజెక్టుపై ఒకే తాటిపైకి రావడం ప్రాధాన్యత సంతరించుకుంది.అసలు గోదావరి-కావేరి అనుసంధానం సాధ్యమేనా అనే ప్రశ్న టెక్నికల్, లీగల్ వర్గాల్లో తలెత్తుతోంది. కేంద్ర జలసంఘం , నేషనల్ వాటర్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ ప్రాథమిక నివేదికల ప్రకారం, సముద్రంలో వృథాగా కలుస్తున్న గోదావరి మిగులు జలాలను కృష్ణా, పెన్నా నదుల ద్వారా కావేరి నదికి మళ్లించడం సాంకేతికంగా సాధ్యమే. గోదావరి బేసిన్‌లోని ఇచ్చంపల్లి, సమ్మక్క బ్యారేజీ లేదా పోలవరం జలాశయం నుంచి దాదాపు 147 టీఎంసీల నీటిని నాగార్జునసాగర్, సోమశిల, నాగార్జునసాగర్ రైట్ కెనాల్, గ్రావిటీ, లిఫ్ట్ పద్ధతుల ద్వారా తమిళనాడులోని గ్రాండ్ ఆనకట్ట వరకు తీసుకెళ్లేలా రూ. 60,000 కోట్లకు పైగా వ్యయంతో డిజైన్లు సిద్ధం చేశారు. ఈ ప్రాజెక్టు నెరవేరితే దక్షిణ భారతదేశంలోని నాలుగు ప్రధాన రాష్ట్రాలైన తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు మరియు పుదుచ్చేరిలకు అపారమైన ప్రయోజనాలు చేకూరనున్నాయి. ఏపీలోని రాయలసీమ, ప్రకాశం , నెల్లూరు జిల్లాల కరువు ప్రాంతాలకు సాగునీరు, తాగునీరు విస్తారంగా లభిస్తాయి. అదే సమయంలో ఏటా తీవ్ర కరవును, తాగునీటి కొరతను ఎదుర్కొంటున్న తమిళనాడులోని డెల్టా జిల్లాలకు , చెన్నై నగర దాహార్తికి కావేరి అనుసంధానంతో శాశ్వత ఉపశమనం లభిస్తుంది. పంట కాలాల్లో కర్ణాటకపై ఆధారపడాల్సిన అవసరం గణనీయంగా తగ్గుతుంది. ఈ ప్రాజెక్టు ఆచరణలోకి రావడానికి ప్రధానంగా మూడు పెద్ద సవాళ్లు అడ్డుగా నిలుస్తున్నాయి. మొదటిది అంతర్రాష్ట్ర జల వివాదాలు. గోదావరిలో మిగులు జలాలు లేవని, ముందస్తుగా తమ నీటి అవసరాలను తీర్చాలని తెలంగాణ ప్రభుత్వం స్పష్టం చేస్తుండగా, డిజైన్ల మార్పులపై ఏపీ తనదైన శైలిలో సూచనలు చేస్తోంది. రెండవది భారీ ఆర్థిక భారం. పదుల వేల కోట్లతో కూడుకున్న ఈ ప్రాజెక్టును జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించి, కేంద్ర ప్రభుత్వమే 90 శాతం నిధులు సమకూర్చాల్సి ఉంటుంది. మూడవది అటవీ, పర్యావరణ అనుమతులు , వేల ఎకరాల భూసేకరణ అవసరం ఉంటుంది. దక్షిణ భారతదేశాన్ని సుభిక్షం చేసే ఈ చారిత్రక ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్లడానికి చంద్రబాబు అనుభవం, విజయ్ రాజకీయ పట్టుదల కలవడం శుభపరిణామం. కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం, ఏపీ, తమిళనాడుల సంయుక్త విజ్ఞప్తుల ఆధారంగా ప్రత్యేక ఎస్పీవీని ఏర్పాటు చేసి, నిధులు కేటాయిస్తేనే ఈ బృహత్తర జల యజ్ఞం కాగితాల నుంచి క్షేత్రస్థాయిలోకి దిగుతుంది. రెండు రాష్ట్రాల సీఎంల మధ్య జరిగిన ఈ చర్చలు రాబోయే రోజుల్లో ఢిల్లీ స్థాయిలో ఎలాంటి కదలిక తెస్తాయో చూడాలి.

# స్థానిక పోరులో బలమైన వ్యూహం
# ఓటు బదిలీ సాధ్యమేనా?




**విజయవాడ :** ఆంధ్రప్రదేశ్‌లో పంచాయతీ, మున్సిపల్, జడ్పీటీసీ ఎన్నికల వేళ అధికార ఎన్డీయే కూటమిలోని ప్రధాన భాగస్వాములైన తెలుగుదేశం, జనసేన పార్టీల మధ్య సీట్ల సర్దుబాటు, ఆధిపత్య పోరు రచ్చకెక్కుతోంది. క్షేత్రస్థాయిలో తమ గ్రాఫ్ , ఓటు బ్యాంక్ అత్యంత బలంగా ఉందని రెండు పార్టీల ద్వితీయ శ్రేణి నాయకత్వాలు గట్టిగా నమ్ముతున్నాయి. శాసనసభ ఎన్నికల్లో 100 శాతం స్ట్రైక్ రేట్‌తో విజయం సాధించామన్న ధీమాతో జనసేన 40 శాతం స్థానాలను డిమాండ్ చేస్తుంటే.. దశాబ్దాల క్షేత్రస్థాయి కేడర్ బలం తమకే ఉందంటూ టీడీపీ స్థానిక నాయకులు ప్రతిఘటిస్తున్నారు. అయితే స్థానిక సంస్థల ఎన్నికల్లో కేవలం పార్టీ బలం లేదా అడిగినన్ని సీట్లు కేటాయించడం మాత్రమే ముఖ్యం కాదు. డివిజన్, వార్డు , గ్రామీణ స్థాయిలో కచ్చితంగా గెలిచే ఆధిపత్యం ఉన్న బలమైన అభ్యర్థులు బరిలో ఉన్నారా లేదా అనేదే అసలు సూత్రం. జనసేన కోరినన్ని స్థానాలు కేటాయించినప్పటికీ, విజయం సాకారం కాకపోతే అది అంతిమంగా కూటమి ప్రభుత్వ ప్రతిష్టకే భంగకరమని టీడీపీ అధిష్టానం భావిస్తోంది. అందువల్లే, కేవలం సీట్ల పంపిణీతో సరిపెట్టకుండా జనసేన తరపున నిలబడే అభ్యర్థుల ఎంపిక, వారి జనాదరణ, విజయావకాశాలపై కూడా టీడీపీ లీడర్‌షిప్ సలహాలు, సూచనలు అందిస్తోంది.ఈ వ్యూహాత్మక సమీకరణాల్లో భాగంగానే బెజవాడ రాజకీయంలో కీలక నేత వంగవీటి రాధాకృష్ణ జనసేన తీర్థం పుచ్చుకోవడం వెనుక పెద్ద ప్లాన్ ఉందనే విశ్లేషణలు వస్తున్నాయి. కృష్ణా, గుంటూరు, ఉమ్మడి గోదావరి జిల్లాల్లో వంగవీటి కుటుంబానికి ప్రత్యేకమైన సామాజిక, రాజకీయ అనుచరగణం ఉంది వంగవీటి రాధా లాంటి ఇమేజ్ ఉన్న నేత పార్టీలో ఉండటం వల్ల అటు కాపు సామాజిక వర్గంతో పాటు స్థానిక స్థానాల్లో కేడర్‌ను ఏకీకృతం చేయడం సులువవుతుందని భావించారు. కిందిస్థాయిలో పార్టీల మధ్య జరుగుతున్న ఈ ఆధిపత్య పోరాటాలు, అభ్యర్థుల మార్పిడులు, అధిష్ఠానాల సలహాలు సాధారణ కేడర్‌లో ఒకింత అసంతృప్తిని రాజేస్తున్నాయి. ఏళ్ల తరబడి గ్రామాల్లో, వార్డుల్లో పార్టీ కోసం కష్టపడిన టీడీపీ, జనసేన స్థానిక నాయకులు తమ సీటు పొత్తులో భాగంగా ప్రత్యర్థి పార్టీకి పోతోందని తెలియగానే తీవ్ర విముఖత చూపుతున్నారు. సామాజిక మాధ్యమాల్లోనూ రెండు పార్టీల అనుకూల హ్యాండిల్స్ ఒకరిపై ఒకరు తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించుకుంటుండటం వాతావరణాన్ని మరింత వేడెక్కిస్తోంది.ఈ పరిణామాలు క్షేత్రస్థాయిలో ఓటు బదిలీ కి పెద్ద అడ్డంకిగా మారతాయా అన్న ఆందోళన కూటమి పెద్దలను వేధిస్తోంది. ఎమ్మెల్యే ఎన్నికల్లో పొత్తు ధర్మం సాఫీగా పనిచేసినప్పటికీ, స్థానిక ఎన్నికలు సంపూర్ణంగా వ్యక్తిగత ప్రభావాలు, బంధుత్వాలు, ప్రాంతీయ విభేదాలపై ఆధారపడి ఉంటాయి. ఒక వార్డులో టీడీపీ అసమ్మతి వర్గం జనసేన అభ్యర్థికి సహకరించకపోవడం లేదా జనసేన కేడర్ టీడీపీ అభ్యర్థికి ఓటు వేయకపోవడం జరిగితే, అది నేరుగా ప్రతిపక్ష వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి అనుకూలంగా మారే ప్రమాదం ఉందనే హెచ్చరికలు వినిపిస్తున్నాయి. వైఎస్సార్‌సీపీని స్థానిక స్థాయిలో కోలుకోకుండా దెబ్బతీయడమే ప్రధాన లక్ష్యంగా పెట్టుకున్న చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌లకు ఈ ఓట్ల బదిలీ సవాలుగా మారింది. ఏరికోరి అభ్యర్థులను బరిలోకి దింపినా, అసమ్మతి నాయకులను ప్రాథమిక దశలోనే ప్రసన్నం చేసుకోలేకపోతే క్షేత్రస్థాయిలో కూటమి అభ్యర్థుల గెలుపు గుర్రాలు నీరుగారే అవకాశాలున్నాయి. అందుకే కేవలం సీట్ల సర్దుబాటే కాకుండా, రెండు పార్టీల స్థానిక కమిటీలను సంయుక్తంగా రంగంలోకి దించేలా సమన్వయ కమిటీల ద్వారా చర్యలు తీసుకుంటున్నారు. స్థానిక ఎన్నికల సమరం కూడా ప్రారంభమైనందున టీడీపీ-జనసేన అగ్రనాయకత్వం ఈ క్షేత్రస్థాయి అసమ్మతిని ఎలా చల్లారుస్తుందనేది ఆసక్తికరంగా మారింది.

# విజయవాడ మేయర్ స్థానంపై ఉత్కంఠ

**విజయవాడ :** ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో కీలక పరిణామం చోటుచేసుకుంది. మాజీ ఎమ్మెల్యే వంగవీటి రాధాకృష్ణ బుధవారం జనసేన పార్టీలో చేరారు. ఆయనతో పాటు తిరుపతికి చెందిన ప్రణీత్ ప్రమోద్ కూడా జనసేన కండువా కప్పుకున్నారు. రాజధాని అమరావతిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్ కల్యాణ్ వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయవాడ మేయర్ రేసులో వంగవీటి రాధాకృష్ణ, తిరుపతి మేయర్ రేసులో ప్రణీత్ ప్రమోద్ జనసేన అభ్యర్థులుగా బరిలోకి దిగే అవకాశం ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది.వంగవీటి మోహనరంగా తనయుడు వంగవీటి రాధాకృష్ణ జనసేనలో చేరుబోతున్నారని నిన్నటి నుంచి పెద్ద ఎత్తున ప్రచారం జరిగింది. విజయవాడలో పలుచోట్ల ఫ్లెక్సీలు సైతం కనిపించాయి. ఈ క్రమంలో బుధవారం సాయంత్రం రాధాకృష్ణ జనసేనలో చేరారు. మొన్నటివరకూ రాధాకృష్ణ సతీమణికి జనసేన నుంచి విజయవాడ మేయర్ గా ఛాన్స్ ఇస్తారని చర్చ జరిగింది. అయితే విజయవాడ మేయర్ పదవి అన్ రిజర్వ్‌డ్‌గా ప్రకటించడంతో సమీకరణాలు ఒక్కసారిగా మారిపోయాయి. రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్ ప్రకటించారు. మేయర్లు, మున్సిపల్ ఛైర్‌పర్సన్లు మొత్తం 123 ఉండగా.. 100 స్థానాలకు ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైంది. వంగవీటి రాధాకృష్ణ ఒక్కసారి ఎమ్మెల్యే అయ్యారు. ఆయన 2004లో కాంగ్రెస్ నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందారు. 2008 లో ప్రజారాజ్యం పార్టీలో చేరగా, 2009 ఎన్నికల్లో పోటీ చేసి ఓడిపోయారు. 2014లో వైఎస్సార్ సీపీ నుంచి పోటీ చేసి ఓటమిపాలయ్యారు. 2019 అసెంబ్లీ ఎన్నికలకు కొన్ని రోజుల ముందు ఆయన టీడీపీలో చేరిన ఆయన అదే పార్టీలో కొనసాగారు. అయితే విజయవాడ నగర మేయర్ స్థానం అన్‌రిజర్వ్‌డ్‌గా కేటాయించడం, కూటమి పొత్తుల్లో భాగంగా ఈ మేయర్ పీఠాన్ని జనసేనకు కేటాయిస్తారనే నడిచింది. దాంతో వంగవీటి రాధాకృష్ణ జనసేన పార్టీలో చేరారని విజయవాడలో, అటు రాష్ట్ర రాజకీయ వర్గాల్లో చర్చ నడుస్తోంది. మరోవైపు స్థానిక సంస్థల ఎన్నికలకు ఎన్డీయే కూటమి పార్టీల మధ్య సీట్ల సర్దుబాటుపై చర్చలు ఇంకా కొలిక్కి రాలేదు. సీఎం క్యాంప్ ఆఫీసులో సీఎం చంద్రబాబుతో జనసేన పార్టీ అగ్రనేతలు నాదెండ్ల మనోహర్, లింగమనేని రమేశ్, హరిప్రసాద్, ఏపీ టీడీపీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, మంత్రి నిమ్మల రామానాయుడు కూడా పాల్గొని సీట్ల కేటాయింపు, పోటీ చేసే స్థానాలపై సుదీర్ఘంగా చర్చించారు.

## రాయలసీమలో ఎన్నికల ఉద్రిక్తతలు..

-మొదటిపేజీ తరువాయి

నియోజకవర్గాల్లో వైసీపీ విధ్వంసం సృష్టించిందంటూ వారు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. ముఖ్యంగా అన్నమయ్య జిల్లా పుంగనూరులో వైసీపీ ఎంపీ మిథున్‌రెడ్డి స్వయంగా దాడులకు పాల్పడ్డారని వారు తీవ్ర ఆరోపణలు చేశారు. పుంగనూరు మున్సిపల్ ఎన్నికల నామినేషన్ కేంద్రం వద్ద ఎంపీ మిథున్‌రెడ్డి, ఆయన అనుచరులు టీడీపీ కార్యకర్తలు, ప్రజలపైకి కాన్వాయ్‌తో దూసుకెళ్లి భయానక వాతావరణం సృష్టించారని వర్ల రామయ్య ఆరోపించారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియో దృశ్యాలను వారు ఎన్నికల సంఘానికి ఆధారాలుగా సమర్పించారు. పెద్దిరెడ్డి కుటుంబం అధికారులను భయభ్రాంతులకు గురి చేస్తూ ప్రజాస్వామ్య ప్రక్రియను అపహాస్యం చేస్తోందని టీడీపీ నేతలు తమ ఫిర్యాదులో పేర్కొన్నారు. వైసీపీ నేతల దౌర్జన్యాలపై తక్షణమే విచారణ జరిపి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని, ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా చూడాలని వారు ఎన్నికల సంఘాన్ని కోరారు. ఈ ఫిర్యాదుతో రాయలసీమలో స్థానిక ఎన్నికల రాజకీయాలు మరింత వేడెక్కాయి.

**మిథున్‌రెడ్డిపై టీడీపీ గూండాల దాడి.. వైఎస్సార్‌సీపీ సీరియస్**

ఎంపీ మిథున్‌రెడ్డిపై హత్యాయత్నాన్ని వైఎస్సార్‌సీపీ తీవ్రంగా ఖండించింది. టీడీపీ నేతలు.. దాడులు చేసి ఎన్నికల్లో గెలవాలని చూస్తున్నారంటూ వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికల్లో గెలవలేక అక్రమమార్గంలో వెళ్తున్నారు. పోలీసులను అడ్డం పెట్టుకుని టీడీపీ నేతలు దాడులకు పాల్పడుతున్నారు. ఏపీలో శాంతి భద్రతలు విఫలమైందని ఆయన మండిపడ్డారు. “బందిపోటు దొంగల్లా టీడీపీ గూండాలు దాడులు చేస్తున్నారు. ఎంపీ మిథున్‌రెడ్డి కాన్వాయ్‌పై కర్రలు, రాళ్లతో దాడులు చేశారు. నామినేషన్ల ప్రక్రియ మొదలైన మొదటిరోజే దాడులు చేస్తున్నారు” అని లేళ్ల అప్పిరెడ్డి ధ్వజమెత్తారు.

**ఓటమి భయంతోనే దాడులు..**

విజయనగరం: ఎమ్మెల్సీ పెనుమత్స సురేష్ బాబు మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వ పాలనలో సామాన్యులకే రక్షణ లేదని.. ఓటర్లను, అభ్యర్థులను భయపెట్టాలని చంద్రబాబు కుట్ర పన్నుతున్నారంటూ మండిపడ్డారు. చిత్తూరు జిల్లాలో ఎంపీ మిధున రెడ్డి పై దాడిని ఖండిస్తున్నాం. చంద్రబాబు దుష్ట పరిపాలనకు వ్యతిరేకంగా ఓటు వేయాలని ప్రజలు సిద్ధంగా ఉన్నారు. ఓటమి భయంతో వైఎస్సార్సీపీ నాయకులపై దాడులు చేస్తున్నారు” అని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.

**ప్రజాస్వామ్యంలో నేడు చీకటి దినం**

చిత్తూరు: ప్రజాస్వామ్యంలో నేడు చీకటి దినం అని వైఎస్సార్‌సీపీ చిత్తూరు నియోజకవర్గం ఇంఛార్జ్ విజయానందరెడ్డి అన్నారు. ఎంపీ మిథున్ రెడ్డి హత్యాయత్నం ఘటనను తీవ్రంగా ఖండించారు, ఓటమి భయంతోనే టీడీపీ నాయకులు దాడులకు పాల్పడుతున్నారు. దాడులను తీవ్రంగా ప్రతిఘటిస్తామని ఆయన హెచ్చరించారు.

## అందరికీ ఆనందం, ఆదాయం, ఆరోగ్యం ఉండాలని ప్రార్థించా



వర్షాలు సమృద్ధిగా కురిసి రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని దుర్గమ్మను ప్రార్థించినట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. ప్రజల్లో పేదరికం పోవాలని, మెరుగైన జీవన ప్రమాణాలు కలగాలని కోరుకున్నట్లు చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున మూలానక్షత్రం రోజున పట్టువస్త్రాలు సమర్పించిన చంద్రబాబు అందరికీ ఆనందం, ఆదాయం, ఆరోగ్యం ఉండాలని ప్రార్థించానని తెలిపారు. దసరా ఉత్సవాల్లో భాగంగా మూలానక్షత్రం రోజున ముఖ్యమంత్రి చంద్రబాబు దంపతులు ఇంద్రకీలాద్రిని సందర్శించారు. భక్తుల కేరింతలకు సీఎం స్పందించి వారికి ఆత్మీయంగా అభివాదం చేస్తూ ముందుకు సాగారు. ఆలయ స్థానాచార్యులు విష్ణుభట?ల శివప్రసాదశర్మ సీఎంకి పరివేష్టం అలంకరించారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున దుర్గమ్మకు పట్టువస్త్రాలు, ఇతర సుమంగళ ద్రవ్యాలను తీసుకుని ఆలయంలోకి వెళ్లిన సీఎం దంపతులకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. వేదమంత్రోచ్ఛరణల మధ్య సీఎం దంపతులు అమ్మవారి అంతరాలయంలోకి చేరుకున్నారు. సరస్వతిదేవి అలంకరణలోని దుర్గమ్మకు షోడషోపచారాలు చేసి ముఖ్యమంత్రి, కుటుంబ సభ్యుల గోత్రనామాలతో పూజ చేశారు. చతుర్వేద ఆశీర్వచనం: రాష్ట్రం అభివృద్ధి చెందాలని ప్రతిపాదిత పథకాలు, అన్ని ప్రాజెక్టులు సత్ఫలితాలను ఇవ్వాలని దివ్యమైన, భవ్యమైన రాజధానిగా అమరావతి నిర్మాణం కావాలని పరిపాలనలో ఎలాంటి అవరోధాలు ఇబ్బందులు, ప్రతికూలతలు లేకుండా అమ్మవారి కరుణాకటాక్షాలను పాలకులకు అందించాలని పండితులు సంకల్పం చెప్పారు. అనంతరం పండితులు చతుర్వేద ఆశీర్వచనం చేసి ప్రసాదం అందించారు. దేవాదాయశాఖ తరఫున సీఎం దంపతులకు అమ్మవారి చిత్రపటాన్ని పాలక మండలి ఛైర్మన్, అధికారులు అందించారు. ఆలయం నుంచి వెలుపలికి వస్తూ క్షేత్రపాలకులు అభయ ఆంజనేయస్వామి, అపరాజితాదేవిని దర్శించుకున్నారు. అనాదిగా ఉన్న రావిచెట్టును చంద్రబాబు తాకి నమస్కరించారు. ఆలయం బయట గట్టుపై కూర్చుని అమ్మవారి ఆలయ శిఖరాన్ని దర్శించి చేతులు జోడించి మొక్కారు. పాలకమండలి సభ్యులు, ఇతరులతో సీఎం ఫొటోలు దిగారు. దుర్గమ్మను దర్శించుకున్న తర్వాత జై దుర్గాభవానీ అంటూ మూడుసార్లు నినదించిన సీఎం చంద్రబాబు రాష్ట్ర ప్రజలందరికీ దసరా శుభాకాంక్షలు తెలిపారు. ‘ప్రభుత్వం తరఫున దుర్గమ్మ తల్లికి చీర, సారె సమర్పించడం నా అదృష్టంగా భావిస్తున్నా. దసరా సందర్భంగా ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని కోరుకున్నా. భక్తులెవ్వరికీ ఇబ్బందులు లేకుండా కార్యక్రమాల్ని నిర్వహిస్తున్నందుకు ఆలయ సిబ్బందిని అభినందిస్తున్నాను. ఇప్పటివరకూ 8 లక్షల మంది దుర్గమ్మను దర్శించుకున్నారు. ఈ నవరాత్రుల్లో మరింత మంది భక్తులు భవానీ మాతను దర్శించుకోనున్నారు. ఈ వేడుకలు మన సంస్కృతీ, సంప్రదాయలకు నిదర్శనం.’

సీఎం దంపతులు అరగంట సేపు ఆలయంలో ఉన్నప్పటికీ దర్శనం కోసం క్యూలైన్లలో ఉన్న భక్తులకు ఏ మాత్రం ఇబ్బంది లేకుండా ముఖమండం ముందు క్యూ మినహా అన్ని వరుసలు యథావిధిగా కొనసాగించారు. దర్శన అనంతరం బయటకొచ్చిన సీఎం క్యూలైన్లలో మహిళలతో ముచ్చటించారు. చిన్నారులను ఆత్మీయంగా పలకరించి ఉత్సాహపరిచారు.

## స్థానిక సమరానికి టీడీపీ సై..

-మొదటిపేజీ తరువాయి

తీసుకుంటున్నారు. ప్రతి మున్సిపల్ కార్పొరేషన్, మునిసిపాలిటీకి సంబంధించి లోతైన విశ్లేషణ జరుపుతూ వడపోత కార్యక్రమాన్ని పక్కాగా నిర్వహిస్తున్నారు. ఈసారి మేయర్లు, మునిసిపల్ ఛైర్మన్ల ఎన్నిక ప్రత్యక్ష పద్ధతిలో జరగనుండటంతో అభ్యర్థుల ఎంపిక మరింత ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ నేపథ్యంలో కేవలం పార్టీ కేడర్‌లోనే కాకుండా ప్రజల్లో మంచి పేరున్న, బలమైన అభ్యర్థులకే పట్టం కట్టాలని పార్టీ నాయకత్వం భావిస్తోంది. ప్రత్యక్ష ఎన్నికల్లో వ్యక్తిగత ఇమేజ్ గెలుపోటములను ప్రభావితం చేస్తుందన్న అంచనాతో అన్ని కోణాల్లో ఆలోచించి తుది నిర్ణయం తీసుకోనున్నారు. స్థానిక సంస్థల పాలన ప్రజల దైనందిన జీవితంతో ముడిపడి ఉంటుందని, అందుకే అత్యుత్తమ నాయకత్వాన్ని ప్రజలకు అందించాలన్నది తమ లక్ష్యమని టీడీపీ వర్గాలు స్పష్టం చేస్తున్నాయి. కేంద్రం, రాష్ట్రంతో పాటు స్థానిక సంస్థల్లోనూ తమ పాలన ఉండేలా ట్రిపుల్ ఇంజన్ సర్కార్ ను ఏర్పాటు చేయడం ద్వారా రాష్ట్రాభివృద్ధిని మరింత వేగవంతం చేయవచ్చని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు భావిస్తున్నారు. ఈ లక్ష్య సాధనలో భాగంగానే స్థానిక ఎన్నికల్లోనూ సత్తా చాటేందుకు పక్కా ప్రణాళికతో ముందుకు వెళ్తున్నారు.

## నామినేషన్ కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు

**గుంపులుగా వస్తే కఠిన చర్యలు.. కలెక్టర్ సుమిత్ కుమార్ హెచ్చరిక**



**చిత్తూరు, చిత్తూరు ఎక్స్‌ప్రెస్, అక్టోబర్16:**

స్థానిక సంస్థల ఎన్నికల నామినేషన్ల ప్రక్రియలో శాంతిభద్రతల పరిరక్షణకు జిల్లా యంత్రాంగం కట్టుదిట్టమైన చర్యలు చేపట్టింది. పుంగనూరులో శుక్రవారం నామినేషన్ కేంద్రాల వద్ద చోటుచేసుకున్న అల్లర్ల నేపథ్యంలో జిల్లాలోని అన్ని నామినేషన్ కేంద్రాల వద్ద శనివారం 144 సెక్షన్(దీబీూా సెక్షన్163) అమలు చేయనున్నట్లు జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి సుమిత్ కుమార్ వెల్లడించారు. నామినేషన్ల దాఖలు సమయంలో అభ్యర్థులు నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని, పెద్ద సంఖ్యలో గుంపులుగా వచ్చి ఎన్నికల నిబంధనలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు. నిబంధనల ఉల్లంఘన ఎన్నికల ప్రక్రియపై ప్రభావం చూపడంతో పాటు నామినేషన్ల తిరస్కరణకు కూడా దారితీయవచ్చని స్పష్టం చేశారు. ఈ మేరకు డివిజన్ స్థాయి పోలీసు, రెవెన్యూ అధికారులు అప్రమత్తంగా ఉండాలని, నామినేషన్ కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా తగిన భద్రతా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఎన్నికల నిబంధనలపై రాజకీయ పార్టీలకు ముందుగానే సమాచారం అందించాలని సూచించారు. నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ప్రశాంతంగా, పారదర్శకంగా జరిగేలా పోలీసు, రెవెన్యూ అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ పేర్కొన్నారు.

## ఎన్నికల విధులను బాధ్యతాయుతంగా నిర్వహించాలి

**ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల ప్రకారమే విధులు నిర్వర్తించాలి**

**చిత్తూరు, చిత్తూరు ఎక్స్ ప్రెస్,అక్టోబర్ 16:**

స్థానిక సంస్థల ఎన్నికల విధులకు నియమితులైన అధికారులు, సిబ్బంది ఎన్నికల కమిషన్ ఆదేశాలు, మార్గదర్శకాల ప్రకారం బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని జిల్లా పరిషత్ సీఈవో రవికుమార్ నాయుడు సూచించారు. ఎన్నికల నిర్వహణలో నిర్లక్ష్యానికి తావులేకుండా, పారదర్శకంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు. చిత్తూరు జిల్లా పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో శుక్రవారం జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల నిర్వహణపై రిటర్నింగ్ అధికారులు (ఆర్వోలు), సహాయ రిటర్నింగ్ అధికారులకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఈవో మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ నిర్దేశించిన గడువులోగా ఎన్నికల ప్రక్రియను పూర్తి చేసేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. మున్సిపల్ ఎన్నికల అనంతరం మండల, జిల్లా పరిషత్ ఎన్నికలు, ఆ తర్వాత గ్రామ పంచాయతీ ఎన్నికలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆర్వో హ్యాండ్‌బుక్‌లోని ప్రతి అంశంపై అధికారులు పూర్తి అవగాహన కలిగి ఉండాలని, ఎన్నికల సమయంలో సొంత నిర్ణయాలు తీసుకోకుండా కమిషన్ నిబంధనల ప్రకారమే ముందుకు సాగాలని సూచించారు. తమకు కేటాయించిన డివిజన్లలో ఓటర్ల జాబితాలను పరిశీలించడంతోపాటు, ఓటర్ల ప్రాతిపదికన రిజర్వేషన్లు, పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలను తనిఖీ చేయాలన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు ఉండేలా ఓటర్ల జాబితాలపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని పేర్కొన్నారు. చిత్తూరు డీఎల్‌డీఓ రవికుమార్, సౌందర్ రాజన్ మాట్లాడుతూ నామినేషన్ల స్వీకరణ, పత్రాల పరిశీలన, ధ్రువపత్రాల ధ్రువీకరణ, అభ్యర్థుల అర్హతలు, నామినేషన్ల తిరస్కరణకు సంబంధించిన నిబంధనలను అధికారులు క్షుణ్ణంగా తెలుసుకోవాలన్నారు. నామినేషన్ల స్వీకరణ, పరిశీలన, ఉపసంహరణ ప్రక్రియల్లో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా ఎన్నికల కమిషన్ నిర్దేశించిన గడువులను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ఎన్నికలు ప్రశాంతంగా, నిష్పక్షపాతంగా జరిగేలా అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. ఈ శిక్షణ కార్యక్రమంలో చిత్తూరు ఆర్డీవో శ్రీనివాసులు, డీఆర్‌డీఏ పీడీ శ్రీదేవి, డ్వామా పీడీ రవికుమార్, జిల్లా విద్యాశాఖ అధికారి లక్ష్మీనారాయణ, తహసీల్దార్లు, ఎంపీడీఓలు, రిటర్నింగ్ అధికారులు, సహాయ రిటర్నింగ్ అధికారులు పాల్గొన్నారు.

## రాహుల్ తాటాకు చప్పుళ్లకు భయపడం

కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వాన్ని అస్థిరపరిచేందుకు ప్రతిపక్షాలు కుట్రలు పన్నుతున్నాయని కేంద్ర మంత్రి జి. కిషన్‌రెడ్డి తీవ్రంగా ఆరోపించారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ విమర్శలను ఆయన “తాటాకు చప్పుళ్లు”గా అభివర్ణించారు. ప్రజాతీర్పును గౌరవించకుండా, దేశంలో అరాచకాన్ని సృష్టించి ప్రభుత్వాన్ని కూలదోయాలని విపక్షాలు పగటి కలలు కంటున్నాయని ఆయన ధ్వజమెత్తారు. హైదరాబాద్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కిషన్‌రెడ్డి మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. రాజ్యాంగం కల్పించిన ప్రజాస్వామ్య హక్కులను ప్రతిపక్షాలు దుర్వినియోగం చేస్తున్నాయని ఆయన మండిపడ్డారు. “పది నెలల్లో మోదీ ప్రభుత్వం కూలిపోతుంది” అంటూ కొన్ని పార్టీలు చేస్తున్న దుష్ప్రచారాన్ని తీవ్రంగా ఖండించిన ఆయన, ఇది ప్రజాతీర్పును అవమానించడమేనని పేర్కొన్నారు. “ప్రధానిగా నరేంద్ర మోదీ 2029 వరకు కొనసాగాలని ప్రజలు స్పష్టమైన తీర్పునిచ్చారు. అయితే, బంగ్లాదేశ్, శ్రీలంక వంటి దేశాల్లో ప్రభుత్వాలను మార్చినట్లుగా ఇక్కడ కూడా చేయాలని ప్రతిపక్షాలు దింపుడుకల్లం ఆశలతో ఉన్నాయి. వారి ఆశలు ఎప్పటికీ నెరవేరవు” అని కిషన్‌రెడ్డి విమర్శించారు. ప్రపంచ దేశాలు తీవ్ర ఆర్థిక సంక్షోభంలో చిక్కుకున్నప్పటికీ, ప్రధాని మోదీ నాయకత్వంలో భారతదేశం స్థిరంగా అభివృద్ధి పథంలో ముందుకు సాగుతోందని ఆయన గుర్తుచేశారు. ప్రభుత్వ పనితీరును చూసి ఓర్వలేకే ప్రతిపక్షాలు ఇలాంటి కుట్రలకు పాల్పడుతున్నాయని ఆరోపించారు. రాహుల్ గాంధీ చేసే తాటాకు చప్పుళ్లకు మోదీ ప్రభుత్వం భయపడదని, తమ ప్రభుత్వం అత్యంత స్థిరంగా ఉందని, పూర్తికాలం కొనసాగుతుందని కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు.

## ఎన్‌హెచ్-65 ఆరు లైన్ల విస్తరణ పనులకు ముహూర్తం ఫిక్స్.

**హైదరాబాద్ :** హైదరాబాద్ నుంచి విజయవాడ జాతీయ రహదారి (ఎన్‌హెచ్?65) విస్తరణకు రంగం సిద్ధమైంది. ఏపీ, ఇతర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు, సరుకు రవాణా వాహనాలకు ఈ జాతీయ రహదారి అత్యంత కీలకం. అయితే, ఈ రహదారిపై రద్దీ రోజురోజుకు పెరుగుతోంది. దీంతో నిత్యం ట్రాఫిక్ జామ్ ల కారణంగా వాహనదారులు, ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.ముఖ్యంగా పండుగుల సమయాల్లో హైదరాబాద్ శివారు ప్రాంతాల నుంచి చౌటుప్పల్, నల్గొండ, సూర్యాపేట మీదుగా ఆంధ్రప్రదేశ్ వెళ్లే మార్గంలో రద్దీ విపరీతంగా ఉంటుంది. అంతేకాక ఈ రహదారిపై వాహనాల రాకపోకల సంఖ్య రోజురోజుకు పెరుగుతుండటంతో ప్రమాదాలుసైతం చోటు చేసుకున్నాయి. ఈ నేపథ్యంలో ప్రస్తుతం నాలుగు లైన్లుగా ఉన్న హైదరాబాద్ ? విజయవాడ జాతీయ రహదారిని ఆరులైన్లుగా విస్తరించేందుకు అనుమతి లభించింది. అయితే, రహదారి విస్తరణ పనులకు ముహూర్తం ఫిక్స్ అయింది.హైదరాబాద్ ? విజయవాడ జాతీయ రహదారి ప్రస్తుతం నాలుగు వరుసలుగా ఉంది. దీనిని ఆరు లైన్ల రహదారిగా అభివృద్ధి చేసేందుకు నిర్ణయించారు. అయితే, ఈ విస్తరణ పనులు 2027 జనవరి నుంచి ప్రారంభించనున్నట్లు భారత జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్‌ఏఐ) లక్ష్యంగా పెట్టుకున్నట్లు రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి వెల్లడించారు. ఢిల్లీలో సోమవారం ఎన్‌హెచ్‌ఏఐ ఛైర్మన్ సంతోష్‌కుమార్ యాదవ్, ఇతర ఉన్నతాధికారులతో మంత్రి సమావేశమై విస్తరణ పనులు, రహదారి భద్రతపై చర్చించారు.రహదారి విస్తరణలో ఆరు ప్రధాన వరుసలతో పాటు సర్వీసు రోడ్లు, జంక్షన్ల మెరుగుదల, సురక్షితంగా రోడ్డు దాటేందుకు అండర్‌పాస్‌లు, అవసరమైన చోట నియంత్రిత ప్రవేశ సదుపాయాలు కీలకంగా మారనున్నాయి. ఇవి పూర్తయితే హైదరాబాద్ నుంచి విజయవాడకు వెళ్లే ప్రయాణికులతోపాటు సరకు రవాణా రంగానికి కూడా ప్రయోజనం కలగనుంది.

# కుప్పంలో 13 నామినేషన్లు దాఖలు

- ●చైర్మన్ స్థానానికి రెండు.. కౌన్సిలర్ స్థానాలకు 11
- ●తొలి రోజు టీడీపీ అభ్యర్థుల నామినేషన్లు..
- ●పోలీసుల పటిష్ట బందోబస్తు

**కుప్పం, చిత్తూరు ఎక్స్‌ప్రెస్, అక్టోబర్ 16:**

కుప్పం మున్సిపల్ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ శుక్రవారం ప్రారంభమైంది. తొలిరోజు మొత్తం 13 నామినేషన్లు దాఖలయ్యాయి. ఇందులో మున్సిపల్ చైర్మన్ స్థానానికి రెండు, వార్డు కౌన్సిలర్ స్థానాలకు 11 నామినేషన్లు సమర్పించారు. తొలి రోజు దాఖలైన నామినేషన్లన్నీ తెలుగుదేశం పార్టీకి చెందినవే కావడం గమనార్హం. చైర్మన్ పదవికి టీడీపీ తరఫున డాక్టర్ వెంకటేశ్, రాజ్‌కుమార్ నామినేషన్లు దాఖలు చేశారు. మొత్తం 32 వార్డులకు ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో కౌన్సిలర్ స్థానాలకు కూడా నామినేషన్ల స్వీకరణ ప్రారంభమైంది. తొలిరోజు ప్రక్రియ ప్రశాంతంగా సాగడంతో ఎన్నికల నిర్వహణకు అధికారులు చేపట్టిన ఏర్పాట్లు కొనసాగుతున్నాయి.

**నామినేషన్ కేంద్రం వద్ద పటిష్ట భద్రత**

నామినేషన్ల స్వీకరణ నేపథ్యంలో కుప్పం మున్సిపల్ కార్యాలయం వద్ద అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఎన్నికల కేంద్రానికి 100 మీటర్ల దూరంలో బారికేడ్లు ఏర్పాటు చేసి, అభ్యర్థితో పాటు మరో ఇద్దరికి మాత్రమే లోపలికి అనుమతి కల్పించారు. వార్డుల వారీగా ప్రత్యేక బూతులు ఏర్పాటు చేసి నామినేషన్ల స్వీకరణ చేపట్టారు. ఎన్నికల ప్రక్రియకు ఎలాంటి ఆటంకాలు కలగకుండా పోలీసు శాఖ పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసింది. ఏఎస్పీ బొడ్డు హేమంత్ ఆధ్వర్యంలో అర్బన్ సీఐ జి.టి. నాయుడు, రూరల్ సీఐ మల్లేష్ యాదవ్, పోలీసు సిబ్బంది భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షించారు. మున్సిపల్ కమిషనర్ వి. శ్రీనివాసరావు నామినేషన్ల స్వీకరణకు సంబంధించిన ఏర్పాట్లను పరిశీలించారు.

**రానున్న రోజుల్లో పెరగనున్న సందడి**

కుప్పం మున్సిపాలిటీలో చైర్మన్ పదవితో పాటు 32 వార్డుల కౌన్సిలర్ స్థానాలకు ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో రాజకీయ పార్టీల్లో ఎన్నికల సందడి మొదలైంది. తొలిరోజు టీడీపీ అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేయగా, మిగిలిన రోజుల్లో ఇతర పార్టీల అభ్యర్థులు కూడా నామినేషన్లు సమర్పించనున్నారు. దీంతో కుప్పం పట్టణంలో రాజకీయ వాతావరణం మరింత వేడెక్కే అవకాశం ఉంది. ఎన్నికల షెడ్యూల్ ప్రకారం



అక్టోబర్ 28న పోలింగ్, అక్టోబర్ 30న ఓట్ల లెక్కింపు జరగనుంది. నామినేషన్ల ప్రక్రియ ముగిసే వరకు కేంద్రం వద్ద భద్రతతో పాటు ఎన్నికల ఏర్పాట్లను అధికారులు నిరంతరం పర్యవేక్షించనున్నారు.

# చిత్తూరు జిల్లాలో ఎన్నికల కోడ్‌పై నిఘా

- ●27 మండలాల్లో ప్రత్యేక బృందాల ఏర్పాటు
- ●తహసీల్దార్లు, పోలీసు సిబ్బంది, వీడియోగ్రాఫర్లకు బాధ్యతలు
- ●జిల్లా ఎన్నికల అధికారి మరియు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్

**చిత్తూరు, చిత్తూరు ఎక్స్ ప్రెస్, అక్టోబర్16:**

స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలుపై జిల్లా యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారించింది. జిల్లాలోని 27 మండలాల్లో ఎన్నికల కోడ్ పర్యవేక్షణకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసింది. మండలాల వారీగా తహసీల్దార్లు, పోలీసు సిబ్బంది, వీడియోగ్రాఫర్లను నియమిస్తూ జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి సుమిత్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్ర ఎన్నికల సంఘం ఈ నెల 14న ప్రకటించిన ఎన్నికల షెడ్యూల్‌కు అనుగుణంగా స్థానిక సంస్థల ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లోకి వచ్చినట్లు కలెక్టర్ తెలిపారు. రెండో విడత సాధారణ ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలతోపాటు పట్టణ స్థానిక సంస్థలు, గ్రామ పంచాయతీల ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యే వరకు ఎన్నికల కోడ్ అమల్లో ఉంటుందని స్పష్టం చేశారు.

**మండలాల వారీగా ప్రత్యేక బృందాలు**

ఎన్నికల కోడ్ అమలును క్షేత్రస్థాయిలో పర్యవేక్షించేందుకు మండలాల వారీగా అధికారులకు బాధ్యతలు అప్పగించారు. బైరెడ్డిపల్లికి ఎం.ఎస్. ప్రసన్న కుమార్, బంగారుపాళ్యానికి ఎస్.షబ్బీర్ బాషా,చిత్తూరుకు బి. కల్యాణి,గంగాధర నెల్లూరుకు సి.కె. శ్రీనివాసులు,గంగవరానికి పి.రేఖ, గుడిపాలకు పూజారి శ్రీనివాసులు, గుడుపల్లికి టి.సీతారాం,ఐరాలకు ఎ. రామకృష్ణ,కార్వేటినగరానికి కె. నాగరాజు,కుప్పానికి పి.రమేష్ బాబును నియమించారు. అదేవిధంగా నగరికి డి. రవికుమార్, నిండ్రకు ఎం.ఈశ్వర్ బాబు, పలమనేరుకు ఆర్.రమేష్ రెడ్డి, పలసముద్రానికి ఎన్.ఎం.గుర్రప్ప, పెద్దపంజాణికి జి.రామమూర్తి, పెనుమూరుకు ఎం.లోకేశ్వరి,పులిచెర్లకు ఆర్. జయసింహ,పూతలపట్టుకు వి. ఉదయ్ సంతోష్, రామకుప్పానికి బి. కౌశలే,రొంపిచెర్లకు పి.కిరణ్ కుమార్, ఎస్.ఆర్.పురానికి ఎస్.లోకనాథ పిళ్లైలను నియమించారు. శాంతిపురానికి ఎం.ప్రకాష్ బాబు,తవణంపల్లికి ఎస్.మాధవరాజు, వి.కోట ాకు బి.సూర్య ప్రకాష్ నాయక్, వెదురుకుప్పానికి కె.బాబు,విజయపురానికి జె. ముని శైలజ, యాదమరికి జి.పి.పార్థసారథిలకు బాధ్యతలు అప్పగించారు.

**ఉల్లంఘనలకు తావులేకుండా పర్యవేక్షణ**

ఎన్నికల సమయంలో ప్రవర్తనా నియమావళి అమలును నిరంతరం పర్యవేక్షిస్తూ, సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రతి మండలంలో నియమితులైన పోలీసు సిబ్బంది, వీడియోగ్రాఫర్లు ప్రత్యేక బృందాలతో కలిసి విధులు నిర్వహించనున్నారు. నియామక ఉత్తర్వులను సంబంధిత ఎంపీడీవోల ద్వారా అధికారులకు అందజేసి, ఉత్తర్వులు అందినట్లు ధ్రువీకరణ పత్రాలను జిల్లా కార్యాలయానికి పంపించాలని సూచించారు. చిత్తూరు ఆర్డీవో, జిల్లా పోలీసు సూపరింటెండెంట్, సంబంధిత పోలీసు సబ్ డివిజన్ల అధికారులు, స్టేషన్ హౌస్ అధికారులు, జిల్లా పంచాయతీ అధికారి, తహసీల్దార్లకు కూడా ఉత్తర్వుల ప్రతులను పంపించి అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎన్నికల ప్రక్రియ ముగిసే వరకు అధికారులు అప్రమత్తంగా ఉండి, ఎన్నికల కమిషన్ నిబంధనలను పక్కాగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ పేర్కొన్నారు.

# ప్రశాంత ఎన్నికల నిర్వహణకు పటిష్ఠ ఏర్పాట్లు







- ●నామినేషన్ కేంద్రాన్ని పరిశీలించిన
- ●కలెక్టర్ సుమిత్ కుమార్, ఎస్పీ తుషార్ డూడి

**పలమనేరు, చిత్తూరు ఎక్స్‌ప్రెస్, అక్టోబర్ 16:**

స్థానిక సంస్థల ఎన్నికలను ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, జిల్లా ఎస్పీ తుషార్ డూడి తెలిపారు. శుక్రవారం పలమనేరు మున్సిపల్ కార్యాలయంలోని నామినేషన్ కేంద్రాన్ని వారు సంయుక్తంగా సందర్శించి, నామినేషన్ల స్వీకరణ ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా నామినేషన్ కేంద్రంలో అభ్యర్థులకు కల్పించిన సదుపాయాలు, భద్రతా ఏర్పాట్లు, అధికారుల విధుల నిర్వహణ, ఎన్నికల నియమావళి అమలుపై సంబంధిత అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు.

**నిబంధనల మేరకు నామినేషన్ల స్వీకరణ**

ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం నామినేషన్ల ప్రక్రియను నిష్పక్షపాతంగా, ఎలాంటి అవకతవకలకు తావులేకుండా నిర్వహించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. నామినేషన్లు దాఖలు చేసే అభ్యర్థులకు అవసరమైన సదుపాయాలు కల్పించాలని, ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యం వహించరాదని స్పష్టం చేశారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేసి ఎన్నికల ప్రక్రియ సజావుగా జరిగేలా చూడాలని సూచించారు.

**అల్లర్లకు పాల్పడితే చర్యలు**

ఎన్నికలు స్వేచ్ఛగా, భయరహిత వాతావరణంలో జరిగేలా పోలీసు శాఖ పటిష్ఠ భద్రతా చర్యలు చేపట్టిందని ఎస్పీ తుషార్ డూడి తెలిపారు. నామినేషన్ కేంద్రాల వద్ద అదనపు బందోబస్తు ఏర్పాటు చేసి, నిరంతరం పర్యవేక్షిస్తున్నట్లు పేర్కొన్నారు. అభ్యర్థులు, వారి మద్దతుదారులను బెదిరించడం, ఓటర్లను ప్రలోభపెట్టడం, గుంపులుగా చేరి ఉద్రిక్తతలు సృష్టించడం వంటి చర్యలను సహించబోమని హెచ్చరించారు. ఎన్నికల నియమావళిని ఉల్లంఘించిన వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ప్రజలు ఎలాంటి భయాందోళనలకు గురికాకుండా ఎన్నికల ప్రక్రియలో పాల్గొనాలని, బెదిరింపులు లేదా అనుమానాస్పద కార్యకలాపాలు గుర్తిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ఎస్పీ కోరారు. సోషల్ మీడియాలో తప్పుడు వార్తలు, రెచ్చగొట్టే పోస్టులు, నిర్ధారణ కాని సమాచారాన్ని ప్రచారం చేయవద్దని సూచించారు. ఎన్నికల ప్రక్రియ పూర్త య్యే వరకు పోలీసు యంత్రాంగం అప్రమత్తంగా ఉంటుందని, శాంతిభద్రతల పరిరక్షణకు ప్రాధాన్యమిస్తూ అవసరమైన చర్యలు కొనసాగిస్తుందని తెలిపారు. ఈ పరిశీలనలో పలమనేరు ఆర్డీవో భవాని, మున్సిపల్, రెవెన్యూ, పోలీసు శాఖల అధికారులు పాల్గొన్నారు.

# హిందూపురంలో మందకొడిగా నామినేషన్ల ప్రక్రియ







**తొలి రోజు 10 నామినేషన్లు దాఖలు..**

**9 వార్డు సభ్యులకు, ఒకటి చైర్‌పర్సన్‌కు**

**హిందూపురం, చిత్తూరు ఎక్స్ ప్రెస్, అక్టోబర్ 16:**

హిందూపురం పురపాలక సంఘం ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ తొలి రోజు మందకొడిగా సాగింది. శుక్రవారం మొత్తం 10 నామినేషన్లు దాఖలైనట్లు ఎన్నికల అధికారి వి. మల్లికార్జున వెల్లడించారు. వీటిలో తొమ్మిది వార్డు కౌన్సిలర్ స్థానాలకు, ఒకటి చైర్‌పర్సన్ పదవికి సంబంధించినవని తెలిపారు. తొలి రోజే 37వ వార్డు నుంచి టీడీపీ అభ్యర్థిగా మాజీ కౌన్సిలర్ రాఘవేంద్ర సతీమణి ఎన్.ఆర్. సహన నామినేషన్ దాఖలు చేశారు. 15వ వార్డు నుంచి మాజీ కౌన్సిలర్ వి. దుర్గామంజుల, ఆమె భర్త వి.పి. నవీన్ కుమార్ ఒక్కొక్క సెట్ నామినేషన్ పత్రాలను సమర్పించారు. చైర్‌పర్సన్ పదవికి బీఎస్పీ తరఫున శ్రీరాములు నామినేషన్ దాఖలు చేసినట్లు సమాచారం. వార్డుల వారీగా టీడీపీ తరఫున 15,31, 37,41,48,49వ వార్డులకు సంబంధించి ఎనిమిది నామినేషన్లు, వైఎస్సార్‌సీపీ తరఫున 43వ వార్డుకు ఒక నామినేషన్ దాఖలైంది. చైర్‌పర్సన్ పదవికి బీఎస్పీ నుంచి ఒక నామినేషన్ వచ్చింది. నామినేషన్ల స్వీకరణకు మున్సిపల్ కార్యాలయంతో పాటు ఎంజీఎం ఉన్నత పాఠశాలలో కేంద్రాలు ఏర్పాటు చేశారు. తొలి రోజు ఆశించిన స్థాయిలో నామినేషన్లు దాఖలు కాకపోవడంతో రానున్న రోజుల్లో ప్రక్రియ ఊపందుకునే అవకాశముంది.

Edited Printed Published & Owned by K.L Krishnam Raju. And Printed at Vijay Publishers and Printers, #1-176, Anjur Village and Post, K.V.B.Puram Mandal, Tirupati District, Andhra pradesh.
Published at Vijay Publications, 19/86-1, Jaya Prakash Road, Kuppam, Chittoor District, Andhra pradesh. EDITOR K.L.KRISHNAM RAJU, RNI. NO. APTEL/2023/86143